
వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 206
పేజీలు : 08 | వెల: రూ.5/-
శుక్రవారం
మే 16, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net



2లో..

## బహిరంగ చర్చకు సిద్ధం

- ఆ మాటలకు కట్టుబడి ఉన్నా..
- కొందరు నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు
- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



వివరాలు2లో..

# ఆదుకునేదెవరు ?

- అకాల వర్షాలతో అన్నదాత కుదేలు
- గాలిలో దీపాలుగా మారుతున్న కొనుగోలు కేంద్రాలు
- కనీస రక్షణ చర్యలు శూన్యం
- ఏ ప్రభుత్వం వచ్చినా రైతన్నకు మిగిలేది కన్నీరే
- వారు చెప్పకునేందుకే గొప్పలు



అధికారంలోకి ఏ ప్రభుత్వం వచ్చినా అన్నదాతకు కన్నీరే మిగులుతోంది. ప్రతి యేడు అకాల వర్షాలు అన్నదాతలను నిలువునా ముంచుతున్నా పరిహారం పేరిట కంటితుడుపు చర్యలకు పాల్పడుతున్నారు తప్ప శాశ్వత పరిష్కారం మాత్రం ఆలోచించడంలేదు. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన వడ్లకు రక్షణ కల్పించడంలో పాలకులు పూర్తిగా విఫలమవుతున్నారు. కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యం సైతం అకాల వర్షానికి తడిసి ముద్దవడం ప్రభుత్వం దివాలాకోరు తనానికి నిదర్శనంగా నిలుస్తోంది. గాలి దుమారాల నుంచి రక్షణ కల్పించేలా కొనుగోలు కేంద్రాల్లో టర్పాలిన్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నా ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడం శోచనీయం. కొనుగోలు కేంద్రాలను తరలించిన ధాన్యాన్ని వెంటనే కాంటాలు వేసి రైస్ మిల్లుకు తరలించాల్సి ఉన్నప్పటికీ గోనె సంచుల కొరత, హమాలీల కొరత, లారీల షార్టేజ్ రైతుల కష్టాన్నీ వర్షార్పణం చేస్తోంది. రైతు ప్రభుత్వాలంటూ గొప్పలు చెప్పకుంటున్న నాయకులు ప్రతి సంవత్సరం ఇదే జరుగుతున్నా ఎందుకు స్పందించడంలేదన్నది మిలియన్ల ప్రశ్నగా మిగులుతోంది. ప్రతి పంటకు రక్షణ చర్యలు చేపడితే ప్రభుత్వం ఆశించినట్లుగా రైతు కోటీశ్వరుడు కావడం మరెంతో దూరంలో లేదనిపిస్తుంది. - వరంగల్ వాయిస్ ప్రతినిధి



8లో..

## భక్తులకు ఇబ్బందులు కలగనివొద్దు

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ
- రెండో రోజు సరస్వతి పుష్కరాల ఏర్పాట్ల పరిశీలన



8లో..

## జైళ్ల శాఖ ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు

- ప్రారంభించిన డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రా
- ఆదరించాలంటూ విజ్ఞప్తి



2లో..

## లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయండి

- బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే
- రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పురోగతిపై సమీక్షా



8లో..

## 87 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాం

- యాసంగి ధాన్యం సేకరణపై మంత్రుల వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ డాక్టర్ సత్య శారద

# ఆదుకునేదెవరు?



- అకాల వర్షాలతో అన్నదాత కుదేలు
- గాలిలో దీపాలుగా మారుతున్న కొనుగోలు కేంద్రాలు
- కనీస రక్షణ చర్యలు శూన్యం
- ఏ ప్రభుత్వం వచ్చినా రైతన్నకు మిగిలేది కన్నీరే
- వారు చెప్పుకునేందుకే గొప్పలు

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** ఏ ప్రభుత్వం వచ్చినా అన్నదాతలను ఆదుకోవడం లేదన్నది అర్థమైంది. అకాల వర్షాలతో పంటలు నష్టపోయి రైతులు లబోదిబోమంటున్నా అధికారులు మాత్రం రైతుల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. మార్కెట్ కమిటీలు ఉన్నా ఉత్తిదే అని తేలింది. మంత్రులు ప్రకటనలకే పరిమితం అయ్యారు. ఇటీవల కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యం అకాల వర్షాలకు పూర్తిగా తడిసిపోయింది. అలాగే ధాన్యం కొనుగోళ్లు చురుకుగా సాగడం లేదు. గత ప్రభుత్వం ప్రచారార్భాటం చేసిందే తప్ప కొనుగోళ్లపై చిత్తశుద్ధి చూపించలేదు. ఇప్పుడేమో ధర్నాలు, ఆందోళనలకు బీఆర్ఎస్ పిలుపునివ్వడం సిగ్గుచేటు. ఇకపోతే కాంగ్రెస్ కూడా అదే దారిలో నడుస్తోంది. క్షేత్రస్థాయిలో మార్కెటింగ్ సిబ్బందిని పంపి ధాన్యం మొత్తాన్ని కొనేలా ప్రణాళికలు సిద్ధం చేయలేదు. దీంతో ఆరుగాలం కష్టపడి పండిరచిన పంటను అమ్ముకోవడం అన్నదాతలకు కష్టంగా మారింది.

### అమ్ముకోలేని పరిస్థితి..

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం రైతుల పాలిట శాపంగా మారుతోంది. అకాల వర్షానికి వడ్ల బస్తాలు తడిసి ముద్దవడంతో ఆరుగాలం కష్టపడి పనిచేసిన రైతన్న కష్టం వర్షార్పనం అవుతోంది. ధాన్యం తూకం వేయకుండా, తూకం వేసిన ధాన్యం తరలించకుండా నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయని, రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి ధాన్యం తడుస్తున్నదని రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో కాంటాల సంఖ్య పెంచి లారీల కొరత తీరుస్తామని



హామీ ఇస్తున్న ప్రజా ప్రతినిధులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం పది రోజులైనప్పటికీ తూకం చేయడం లేదన్న ఫిర్యాదులున్నాయి. సొసైటీ వాళ్లను అడిగితే రైస్‌మిల్లర్లు వద్దని చెబుతున్నారని సమాధానం ఇస్తున్నారని చెప్పి దాటవేస్తున్నారు.

### అధికారుల నిర్లక్ష్యం..

గత కొద్ది రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు రైతులను ఆగమాగం చేస్తున్నాయి. ఆదుకోవాల్సిన అధికారులు చేతులెత్తేశారు. జిల్లాస్థాయి అధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. ధాన్యం కొనకపోవడంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసి మొలకలు వస్తున్నాయి. ఇకపోతే ఇటీవల కురిసిన అకాల వర్షం రైతులకు అపార నష్టం మిగిల్చింది. పలు గ్రామాల రైతులు విక్రయానికి తీసుకొచ్చిన జొన్నలతోపాటు తూకం వేసిన జొన్న బస్తాలు వర్షానికి తడిసిపోయాయి. జొన్నలను కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చామని, తూకం వేసిన అనంతరం లారీల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొన్నదని రైతులు తెలిపారు. జొన్న బస్తాలను తరలించేందుకు ఒక్కో బస్తాకి రూ.10–రూ.20 తీసుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రం అంతటా ఇదే దుస్థితి నెలకొంది. వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టి రైతులకు ఊరట కల్పించాల్సి ఉంది.

### ప్రభుత్వ చర్యలు శూన్యం..

ఏ ప్రభుత్వం వచ్చినా ఏమున్నది గర్వకారణం అన్నట్లుగా మారింది రైతుల పరిస్థితి. ప్రతి సంవత్సరం మే మాసంలో అకాల వర్షాలతో రైతులు ఆగమాగం అవుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారని రైతులు ఆరోపిస్తున్నారు. అతివృష్టి, అనావృష్టితో రైతులు నష్టాలపాలవడం ఒక ఎత్తయితే అకాల వర్షాలు రైతులను నిండా ముంచుతున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనుగోలు కేంద్రాలకు తరలించినప్పటికీ అక్కడ కూడా రక్షణ లేకపోవడంతో రైతులకు కన్నీరే మిగులుతోంది. కొనుగోలు కేంద్రాల్లో కావాల్సినన్ని టార్పాలిన్లు ఏర్పాటు చేస్తున్నట్లు పాలకులు ప్రకటిస్తున్నా అవి కంటి తుడుపు చర్యలుగానే మిగులుతున్నాయి. ధాన్యం పూర్తిగా నీటిలో కొట్టుకు పోయి రైతు నిండా మునిగాక అధికారులు, నాయకులు స్పందించి పరిహారం అందిస్తామంటూ ప్రకటనలు చేయడం కాకుండా కొనుగోలు కేంద్రం వచ్చిన ధాన్యంలో ఒక్క గింజ కూడా తడువకుండా చూసుకోవాల్సిన బాధ్యతను అటు ప్రభుత్వం, ఇటు అధికారులు తీసుకున్నప్పుడే రైతులు నిజంగానే కోటీశ్వరులుగా మారే అవకాశం ఉంటుంది. ఆ దిశగా ప్రభుత్వం శాశ్వత చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.



# లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయండి

- బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే
- రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పురోగతి పై సమీక్షా

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపికను త్వరితగతిన పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పురోగతిపై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో కమిషనర్ పాల్గొని సమర్థవంతంగా పూర్తి చేయుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించిన అర్హులైన లబ్ధిదారుల దరఖాస్తుల పరిశీలన, ఎంపిక ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అనంతరం బ్యాంకులకు లోన్ పరిశీలన నిమిత్తం పంపించడం జరుగుతుందన్నారు. అట్టి పరిశీలన తదుపరి కమిటీ ఆధ్వర్యంలో సెలక్షన్ లిస్ట్ తయారుచేసి అట్టి జాబితాను కలెక్టర్ కు మంజూరు కోసం పంపించడం జరుగుతుందన్నారు. ఇట్టి ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి సూచించిన గడువులోగా పంపాలన్నారు. బల్దియా పరిధి 66 డివిజన్ ల నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ లకు సంబంధించి 36 వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇందులో 30 వేల దరఖాస్తుల పరిశీలన పూర్తి చేశామన్నారు. మిగతా దరఖాస్తులను వెంటనే పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, నోడల్ అధికారులు ఆలివేలు, రాజేశ్వర్, ఎల్ డీఎం రాజు, డిప్యూటీ కమిషనర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# బహిరంగ చర్చకు సిద్ధం

- ఆ మాటలకు కట్టుబడి ఉన్నా..
- కొందరు నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు
- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఏ పని చేయడానికైనా అప్పటి మంత్రులు పైసలు తీసుకునేవారని నేను మాట్లాడిన మాటలు అక్షర సత్యాలని, ఆ మాటలకి నేను ఇప్పటికీ కట్టుబడి ఉంటానని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రకటించారు. అవి తప్పు అని నిరూపించేవారు బహిరంగ చర్చకు రావాలని డిమాండ్ చేశారు. నిన్న నేను వరంగల్ లో చేసిన వ్యాఖ్యల మీద కొంతమంది పనిగట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండి పడ్డారు. రాంనగర్ లోని మంత్రి స్వగృహంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె బీఆర్ఎస్ నాయకులపై ఘాటుగా స్పందించారు. కొంతమంది తన వ్యాఖ్యలను తప్పుగా వక్రీకరించడం సహేతుకం కాదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోని మంత్రుల పనితీరును.. వారు ప్రతి ఫైలుకు డబ్బులు తీసుకునే వారని నేను ఆ వ్యాఖ్యలు చేశానని, ఇది నిజమో కాదో వాళ్లకి తెలుసన్నారు. మా ప్రభుత్వం అద్భుతంగా పరిపాలన చేస్తుంటే ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు తమ పెయిడ్ సోషల్ మీడియా ద్వారా విష ప్రచారం చేసే కుట్ర చేస్తున్నారని మండి పడ్డారు. అందులో భాగంగానే ఆ వీడియోలో నా వ్యాఖ్యల్ని ముందు వెనక కొంత తీసేసి, మిగతా దానిని కావాలనే హైలైట్ చేస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో మంత్రులు పైసలు తీసుకొని పనిచేసేవారిని మాత్రమే తను అన్నట్లు పునరుద్ఘాటించారు. ఈ వీడియోను ఇలా సర్క్యులేట్ చేసి.. మా కేబినెట్ సభ్యుల మధ్య గొడవ పెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇది సరికాదని హితవు పలికారు. మీ ఆశలు నెరవేరవన్నారు. మా కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రులంతా అద్భుతంగా పనిచేస్తున్నారన్నారు. మా ప్రభుత్వానికి పనిచేసుడూ తెలుసు.. పరిపాలన చేయడం తెలుసన్నారు. మీ బీఆర్ఎస్ వాళ్ళకి సోషల్ మీడియాలో దొంగ ప్రచారం, తప్పుడు ప్రచారం ఎలా చేయడమో మాత్రమే తెలుసన్నారు. ఇటువంటి దుష్ప్రచారాలు ఇంకొసారి చేస్తే ఎంత మాత్రం సహించేదిలేదని హెచ్చరించారు. ఇలా చేసే ఏ ఒక్కరినీ వదిలి పెట్టేది లేదన్నారు. అసలు మీ బీఆర్ఎస్ నేతల నిర్వాకం వల్లనే కదా మంత్రులకు డబ్బులు ఇస్తే తప్ప ఫైళ్లు క్లియర్ కావు అనే భావన ప్రజల్లో బలంగా నాటుకుపోయిందన్నారు. ఈ విషయం మీ హయంలో పని చేసిన మంత్రి నాయిని నరసింహారెడ్డి, కేసీఆర్ మానస పుత్రిక ఆయన మిషన్ కాకతీయలో ఉన్న కమిషన్ బాగోతాన్ని కమిషన్ కాకతీయ అని సంబోధించి మీ అవినీతిని బయట పెట్టలేదా అంటూ ప్రశ్నించారు. ఇక దళిత బంధులో ప్రతి ఎమ్మెల్యే 30శాతం కమిషన్ తీసుకుంటారని అప్పటి సీఎం కేసీఆరే మీ ఎమ్మెల్యేల గురించి బహిరంగంగా ప్రకటించలేదా అంటూ మండిపడ్డారు. ఊర్ల మీద పడి ప్రజల రక్తాన్ని పీల్చారు కాబట్టే ప్రజలు మీకు ఎన్నికల్లో బుద్ధి చెప్పారన్నారు. అయినా మీ బుద్ధి మారలేదన్నారు. ప్రతి అంశానికి వక్రభాష్యాలు చెబుతూ మీ వంకర బుద్ధిని బయట పెట్టుకుంటున్నారని దుయ్య బట్టారు. పద్ధతి మార్చుకోకపోతే అవినీతికి, అబద్ధాలకు పుట్టిన విష పురుగు బీఆర్ఎస్ ను ప్రజలే నామరూపాలు లేకుండా నలిపేస్తారని హెచ్చరించారు.

# సీపీఐ మహాసభలను విజయవంతం చేయండి

◆ పార్టీ సీనియర్ నేత నేదునూరి రాజమౌళి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ప్రజా సమస్యలపై ఉద్యమంతోనే పరిష్కారం సాధ్యమవుతుందని సీపీఐ నేత నేదునూరి రాజమౌళి వ్యాఖ్యానించారు. జాతీయ ప్రజాతంత్ర విప్లవోద్యమంలో భాగంగా గ్రామ స్థాయి నుంచి కమ్యూనిస్టు పార్టీని నిర్మాణాత్మకంగా బలోపేతం చేస్తామని, దోపిడి, పీడన, అసమానతలపై పోరాటం కొనసాగుతుందని ఆయన అన్నారు. శుక్రవారం హనుమకొండ అంబేద్కర్ సర్కిల్ వద్ద సీపీఐ జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రతి సంవత్సరం కోటి ఉద్యోగాలు, ప్రతి ఖాతాలో రూ.15 లక్షలు, రైతు ఆదాయం రెట్టింపు చేయడం వంటి హామీలు అన్నీ వాయిదా వేసిన భాషణలుగానే మిగిలిపోయాయని విమర్శించారు. పార్లమెంటు నియోజకవర్గాల డీలిమిటేషన్ విషయంపై మాట్లాడుతూ, దక్షిణ భారత రాష్ట్రాలకు న్యాయం జరగకపోతే సహించేది లేదని హెచ్చరించారు. రైతు ఉద్యమం వల్ల నల్ల చట్టాలను వెనక్కి తీసుకున్నప్పటికీ, పూర్తిగా రద్దు చేయలేదని గుర్తుచేశారు. తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇది సంఘటిత, అసంఘటిత కార్మికులపై ద్రోహమని అభివర్ణిస్తూ, ఈ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని కోరారు. ఆరోగ్యశ్రీ నిధులను విడుదల చేసి పేదలకు వైద్యం అందుబాటులోకి తేవాలని, సర్పంచులు బిల్లుల కోసం ఎదురుచూపులు చూస్తున్నారని, కళాశాలల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, గతంలో ఉన్న హసన్‌పర్తి నియోజకవర్గాన్ని తిరిగి ఏర్పాటు చేసి, ఒక జిల్లా – ఒక నియోజకవర్గంగా ఉండేలా చూడాలని ప్రభుత్వానికి సూచించారు. ఈనెల 26న హసన్‌పర్తి హైస్కూల్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. దీనికి ముఖ్య అతిథులుగా సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర సిపిఐ సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హాజరవుతారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కొంగ వీరస్వామి, సాయిని నరేందర్, సోమ రామ్మూర్తి, చాపర్తి కుమారస్వామి, గాడ్డే, నలిగంటి చంద్రమౌళి, భూక్య సునీల్, కోనూరు రంజిత్ గౌడ్, పోతరాజు లక్ష్మీనారాయణ, పెండ్లి అశోక్ బాబు, ఫరీదా తదితర నాయకులు పాల్గొన్నారు.

# ప్రకృతి వైపరీత్యాల్లో సేవలందించేందుకు ఎన్సీసీ శిక్షణ




**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్థానిక లాల్ బహుదూర్ కళాశాలలో ఎన్సీసీ ఆర్మీ పదవ తెలంగాణ బటాలియన్ ఆధ్వర్యంలో ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించబడిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అరుణ డీహెచ్.రావు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం రక్షణ శాఖ మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు, "ఆపరేషన్ సింధూర్" అనంతరం ఎన్సీసీ ఆర్మీ రెండవ ఉపసైనిక దళంగా వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొనడానికి సిద్ధంగా ఉండే విధంగా నిర్వహించబడింది. ప్రకృతి వైపరీత్యాలు, వరదలు, అగ్ని ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు, యుద్ధ వాతావరణం వంటి విపత్తుల సమయంలో ప్రజలకు ప్రథమ చికిత్స, రక్తదానం, ప్రాణాపాయ పరిస్థితుల నుంచి రక్షించేందుకు ఎన్సీసీ క్యాడెట్స్ సన్నద్ధంగా ఉండేలా ఈ శిక్షణ ఇచ్చినట్లు ఆమె వెల్లడించారు. డిఫెన్స్, ఎన్సీసీ అధికారుల సూచనల ప్రకారం, ఈ శిక్షణ నిన్న, ఈరోజు కళాశాల ప్రాంగణంలో నిర్వహించబడింది. ప్రజల ప్రాణాలను కాపాడడంలో ఆర్మీకి మద్దతుగా సేవలందించేందుకు క్యాడెట్స్‌ను సిద్ధం చేయడం ఈ శిక్షణలో ప్రధాన లక్ష్యమని ప్రిన్సిపల్ చెప్పారు. ఈ కార్యక్రమంలో కెప్టెన్ డాక్టర్ ఎం. సదానందం, జూనియర్ అండ్ ఆఫీసర్ కోట భాగ్యలక్ష్మి, శివాని ఆర్.ఏ., బి.సాయి గణేష్ (కంపెనీ క్వార్టర్ మాస్టర్), ఎండీ సోహెల్, పి.సాహిత్య, వై.రష్మిత, ఎస్.మనుష, జి.సిరివెన్నెల, వి.హరి లోకేష్, ఎం.కౌశిక్ తదితర ఎన్సీసీ క్యాడెట్స్ పాల్గొన్నారు. వీరు స్వచ్ఛందంగా సేవ చేయడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.

# ఇంజినీరింగ్ ఫీజుల పెంపు నిర్ణయం సిగ్గుచేటు

ఏఐఎఫ్‌డీఎస్ నేత గడ్డం నాగార్జున



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల ఫీజులు పెంచే యోచనను తక్షణం విరమించాలని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బీ కేటగిరీ సీట్లు కౌన్సిలింగ్ ద్వారా నింపాలని కోరింది. డొనేషన్ పేరుతో లక్షల రూపాయలు వసూలు చేస్తూ అనేక అక్రమాలకు పాల్పడుతున్న కాలేజీలపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలు ఫీజు పెంపు కోసం టీఏఎఫ్ఆర్సీకి ప్రతిపాదనలు పంపడం బాధాకరమని తెలిపారు. అలాంటి ప్రతిపాదనలను తిరస్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికే ఈ కాలేజీలు అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను దోచుకుంటున్నాయని ఆరోపించారు. ఇంజినీరింగ్ విద్యను పూర్తిగా వ్యాపారంగా మలచిన పరిస్థితి దురదృష్టకరమని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు ఈ విద్య అందకుండా పోతుండటంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అర్హతలేని అధ్యాపకులతో కాలేజీలను నడుపుతున్నట్లు ఆరోపించారు. తనిఖీల సమయంలో తాత్కాలికంగా అధ్యాపకులను నియమించుకుని మోసం చేస్తున్నట్లు చెప్పారు.

# అమెరికాలో తౌటిరెడ్డి నర్సింగారెడ్డికి ఘన సన్మానం




**వరంగల్ వాయిస్, న్యూజెర్సీ (అమెరికా):** న్యూజెర్సీ తెలంగాణ సంఘం ఆధ్వర్యంలో హన్మకొండ జయ హాస్పిటల్ ఎండీ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ తౌటిరెడ్డి నర్సింగారెడ్డికి ఘన సన్మానం జరిగింది. ఈ కార్యక్రమానికి పింగల్ భగవాన్ రెడ్డి అధ్యక్షత వహించారు. తెలంగాణ ముద్దుబిడ్డ డాక్టర్ టి.నర్సింగారెడ్డిని అమెరికాలో స్థిరపడ్డ ప్రవాస భారతీయులు, ముఖ్యంగా తెలంగాణ తెలుగు సమాజం సభ్యులు ఎంతో గౌరవంగా సన్మానించారు. చిన్న వయస్సులోనే అంచెలంచెలుగా ఎదిగి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఐఎంఏ అధ్యక్షుడిగా, ప్రైవేట్ నర్సింగ్ హోమ్స్ సంఘం నేతగా, జాతీయ మెడికల్ సంఘం ఉపాధ్యక్షుడిగా సేవలందించడం మనకందరికీ గర్వకారణమని పలువురు ప్రముఖులు అన్నారు. ఈ సందర్భంగా పింగల్ భగవాన్ రెడ్డి, తోట రవీందర్, దత్తారెడ్డి, శ్రీనివాసరెడ్డి, మల్లారెడ్డి, గోపి, క్రిష్ణ, లక్ష్మారెడ్డి, డాక్టర్ శ్రీపాల్ బాబా, ధ్రువ, డాక్టర్ శ్రీధర్ తదితరులు నర్సింగారెడ్డి సేవలను ప్రశంసిస్తూ ఘనంగా సన్మానించారు. సన్మానం సందర్భంగా డాక్టర్ టి. నర్సింగారెడ్డి మాట్లాడుతూ, అమెరికాలో నివసిస్తున్న ప్రవాస భారతీయులు, ముఖ్యంగా తెలంగాణ వారంతా కలసి చేసిన ఈ సన్మానం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని అన్నారు. "సప్తసముద్రాలు దాటి వచ్చి మీంతా ఒక కార్యదినంలో కూడా హాజరై చూపించిన ఆదరాభిమానాన్ని నేను ఎప్పటికీ మరిచిపోలేను. ప్రత్యేకంగా బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, భగవాన్ రెడ్డి వంటి స్నేహితులు నా జీవితంలో చిరస్థాయిగా నిలిచిపోతారు. మీరు తెలంగాణ అభివృద్ధికి చేయూతనివ్వాలని ఆకాంక్షిస్తున్నాను," అని తెలిపారు. ఈ కార్యక్రమం తెలంగాణ సమాజాన్ని ప్రతినిధించేదిగా, డాక్టర్ నర్సింగారెడ్డి యొక్క వైద్య, సామాజిక సేవల గుర్తింపుగా విజయవంతంగా జరిగింది.

# పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి




**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** మండలంలోని భీంపల్లి జడ్పీఎస్ఎస్, ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో బడిబాట కార్యక్రమంపై చర్చ జరగగా, అక్షరాస్యత సాధనపై మహిళా సంఘాలతో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు చెల్లించడం అవసరం లేదని, గ్రామంలోని పిల్లలను మన ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పాలని పిలుపునిచ్చారు. అలాగే, నిరక్షరాస్యతను తొలగించేందుకు 'డల్లసీ యూపీ'లో అర్హులైనవారిని నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ తిమ్మయ్య, పీఎస్ హెచ్ఎం వీరస్వామి, వీఓ జ్యోతి, వడ్డం మమత, విద్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

# ములుగు మైనారిటీ గురుకులంలో నాణ్యమైన విద్య



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** ములుగు మండలంలోని దేవగిరిపట్నంలోని మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఒగ్లాపూర్ సైలాని బాబా దర్గా పీఠాధి పతి అబ్దుల్ హమీద్ బాబా అన్నారు. శుక్రవారం ప్రిన్సిపాల్ వై.శ్రీలత ఆధ్వర్యంలో పాఠశాల అడ్మిషన్ల కొరకు ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగాదర్గా పీఠాధిపతి అబ్దుల్ హమీద్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ములుగు మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థుల ను చేర్పించాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.శ్రీలత, మైనారిటీ ప్రతినిధి ఎస్ కే మోయిన్, ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యం నీడన కట్టు కాలువ



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** మండలంలోని కామారం, పెంచుకులపేట గ్రామాల మధ్య ఉన్న కట్టు కాలువను సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలువ ద్వారా చుట్టుపక్కల గ్రామాల రైతులు వరి సాగు చేస్తున్నారు. కానీ ప్రస్తుతం తూములు సరిగా పనిచేయకపోవడంతో పంటలకు నీరు అందక ఎండిపోతున్నాయని చెబుతున్నారు. కాలు కాలువ మరమ్మతులు జరగకపోవడం వల్ల పిచ్చి మొక్కలు, చెట్లు, గడ్డి పెరిగిపోవడంతో చివరి ఆయకట్టు వరకు నీరు చేరడం లేదని రైతులు వాపోతున్నారు. వర్షాకాలం సన్నాహకంగా ఉండే ఈ సమయంలో కూడా అధికారులు కాలువను నిర్లక్ష్యంగా వదిలేసి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. "మునుపు ఇక్కడ రెండు పంటలు పండుతుండేవి. కానీ ఇప్పుడు ఒక్క పంట కూడా సక్రమంగా పండడం లేదు," అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువ పరిస్థితిపై ఇప్పటికైనా ఐబీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కామారం, పెంచుకులపేట గ్రామాల రైతులు డిమాండ్ చేస్తున్నారు. "కాలువను నమ్ముకున్న మాకు నీరు లేక కన్నీరు మిగిలింది" అని బాధపడుతున్నారు.

4 WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

శుక్రవారం, మే 16, 2025

## గోమాతలకు దానా బస్తాల వితరణ



**వరంగల్ వాయిస్, గణపురం :** కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లు గోశాల గోమాతలకు గణపురం మండల కేంద్రానికి చెందిన పెద్దపల్లి విరాట్ చారి రమాదేవి ల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం దాన బస్తాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారికి పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలను అందజేశారు. గోశాల గోమాతలకు దానా బస్తాలు అందజేసిన దంపతులకు కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

## బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించండి




**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్ ఉపాధి హామీ కార్మికుల వద్ద వినూత్న రీతిలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం ప్రతి శుక్రవారం తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశం ఏర్పాటులో భాగంగా నేడు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ ఉపాధి హామీ పని చేస్తున్న దగ్గరకు వెళ్లి తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేశారు. బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత యూనిఫామ్స్, రాగి జావా, మధ్యాహ్న భోజనం, ఉచిత నోట్ బుక్స్ గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు లకావత్ దేవా, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రైతులకు గుర్తింపు కార్డులు



**వరంగల్ వాయిస్, నడికూడ :** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం ద్వారా పట్టాదారు పాస్ పుస్తకం కలిగిన ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్ లో నమోదు చేసుకొని 11 అంకెల ఫార్మర్ ఐడీని పొందాలని మండల వ్యవసాయ అధికారి పోరిక జై సింగ్ తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు మాత్రమే కేంద్ర ప్రభుత్వ రాయితీలు పంటల బీమా, పీఎం కిసాన్ వంటి పథకాలు వర్తింప చేయబడతాయని తెలిపారు. పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్ కార్డుకు అనుసంధానించిన మొబైల్ నెంబర్ తీసుకొని వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద నమోదు చేసుకొని 11 అంకెల ఐడీని పొంది భద్రపరచుకోవాలని కోరారు. వ్యవసాయ విస్తరణ అధికారులు జె.ప్రదీప్ నడికూడ, రామకృష్ణ చర్లపల్లి, జె.ప్రశాంత్ రాయపర్తి, కే.చికిత ధర్మారం క్లస్టర్లలో రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేసుకోవాలని తెలిపారు.

## నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్య



**వరంగల్ వాయిస్, జనగామ :** తెలంగాణ ప్రభుత్వం నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందజేస్తుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. మైనారిటీ గురుకులాల్లో అడ్మిషన్ల ప్రవేశానికి సంబంధించిన పోస్టర్ ను కలెక్టర్ తన ఛాంబర్ లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనగామ, స్టేషన్ ఘనపూర్ పాఠశాలలో పది ఫలితాల్లో 100శాతం ఫలితాలు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలోని మైనార్టీలందరూ నాణ్యమైన విద్య కోసం మైనార్టీ విద్యాసంస్థలల్లో అడ్మిషన్ పొందాలని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి విక్రమ్ కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ కే.కుమార్ స్వామి, కళాశాల ప్రిన్సిపాల్ అనిల్ బాబు, స్టేషన్ ఘనపూర్ ప్రిన్సిపల్ మాధవి లత పాల్గొన్నారు.

# డెంగీ నియంత్రణకు చర్యలు చేపట్టాలి




**వరంగల్ వాయిస్, వరంగల్:** జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది, ఎంజీఎం నర్సింగ్ కళాశాల విద్యార్థినుల సమన్వయంతో డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంజీఎం నర్సింగ్ కళాశాల నుంచి ఐఎంఏ హాల్ వరకు ఈ ర్యాలీ నిర్వహించబడింది. అనంతరం ఎంజీఎం జంక్షన్ ప్రధాన కూడలిలో ప్లకార్డులతో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు జెండా ఊపి ప్రారంభించారు. తరువాత ఐఎంఏ హాల్ లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ సంవత్సరం డెంగీ దినోత్సవ నినాదం "సమాజ భాగస్వామ్యంతో సత్వర నివారణ చర్యలు చేపట్టుట – పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవన విధానం ద్వారా డెంగీ వ్యాధిని అరికట్టుట" అని తెలిపారు. డెంగీ వ్యాధికారక ఈడీస్ దోమలు మంచినీటిలో పెరుగుతాయని, ఇవి ప్రధానంగా పగటిపూట కరిచే లక్షణం కలిగి ఉంటాయని చెప్పారు. అందువల్ల ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, ప్రతి శుక్రవారం 'డ్రైడే' పాటించడం ద్వారా సుమారు 90% వరకు వ్యాధి నియంత్రించవచ్చని వివరించారు. వ్యాధి ప్రభావిత ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రజలలో అవగాహన కల్పించడం, విస్తృతంగా వైద్య శిబిరాలు నిర్వహించడం, డెంగీ లక్షణాలు ఉన్నవారికి రక్తపరీక్షలు నిర్వహించడం ద్వారా మరణాలను నివారించవచ్చని సూచించారు. గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ ప్రధాన ప్రజారోగ్య వైద్యాధికారి డాక్టర్ రాజారెడ్డి మాట్లాడుతూ, అర్బన్ మలేరియా సిబ్బంది, ఆరోగ్యశాఖ సిబ్బందితో సమన్వయంగా డెంగీ నియంత్రణ చర్యలు చేపట్టాలని, దోమల పెంపకాన్ని, కరిచే అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే ప్రజలు సామాజిక బాధ్యతతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి చికిత్స పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రకాష్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ కొమురయ్య, డాక్టర్ ఆచార్యపతి, డాక్టర్ అర్చన, డాక్టర్ విజయకుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యశస్విని, జిల్లా మలేరియా అధికారి రజిని, డిప్యూటీ డెమో అనిల్, ఇంచార్జి ఏఎంఓ మాడిశెట్టి శ్రీనివాస్, సబ్ యూనిట్ ఆఫీసర్ నాగిరెడ్డి, హెల్త్ సూపర్వైజర్లు సదానందం, రాజశేఖర్, నర్సమ్మ, మధుకర్, నర్సింగ్ కళాశాల ట్యూటర్ స్వర్ణలత, సీసీ. నాగరాజు, వైద్య సిబ్బంది రాధాకృష్ణ, రత్నాకర్, కుమారస్వామి, చక్రపాణి, మసూద్, మున్సిపల్ సిబ్బంది, నర్సింగ్ కళాశాల విద్యార్థినులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## వేగంగా పట్టణ సుందరీకరణ పనులు

### పరిశీలించిన కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**వరంగల్ వాయిస్, జనగామ :** పట్టణ కేంద్రంలోని హనుమకొండ బైపాస్ రోడ్డులో స్వాగత తోరణం ఏర్పాటు పనులను, అలాగే హైదరాబాదు రోడ్డు, పెంబర్తి బై పాస్ లో జంక్షన్ అభివృద్ధి పనులను, అదే విధంగా బతుకమ్మ కుంట సుందరీకరణ పనులను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శుక్రవారం సందర్శించి, పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయా పనుల పురోగతిని కలెక్టర్ పరిశీలించి, సంబంధిత వివరాలపై ఆరా తీసి మున్సిపల్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ పనులను మరింత వేగవంతం చేయాలని, నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ పర్యవేక్షణలో కలెక్టర్ వెంట మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఏఈ మహిపాల్, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జూలై 9కి దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె వాయిదా



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లా ఆల్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో శివనగర్ తమ్మెర పోతన భవన్ లో విలేకరుల సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గన్నారపు రమేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి, ఐఎఫ్ టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్, ఐఎన్టీయూసీ జిల్లా కార్యదర్శి పాశం రవి, బీఆర్టీయూ జిల్లా నాయకుడు యాకూబ్, ఏఐసీసీటీయూ జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు మే 20న జరగాల్సిన దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా తాత్కాలికంగా వాయిదా వేసి 2025 జూలై 9న నిర్వహించనున్నట్లు ప్రకటించారు. అయితే మే 20న కూడా స్థానిక యూనియన్ల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. ఇప్పటికే వరంగల్ జిల్లా వ్యాప్తంగా 13 మండలాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి, సమ్మె నోటీసులు అందజేయడం జరిగినట్లు తెలిపారు. సమయం పెరగడంతో ఈ అవకాశం ఉపయోగించుకుని కింది స్థాయి కార్మికుల వరకు వెళ్లి కేంద్ర బీజేపీ ప్రభుత్వంలోని కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, 29 కార్మిక చట్టాలను రక్షించుకోవడానికి పోరాటం మరింత ముమ్మరంగా కొనసాగించాలని పేర్కొన్నారు. నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలన్న డిమాండ్‌తో ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సిన అవసరముందన్నారు. సమ్మె వాయిదా కారణంగా కార్మికులు నిరుత్సాహపడకుండా, మరింత కసితో చట్టాల పరిరక్షణ కోసం పని చేయాలని, 2025 జూలై 9న నిర్వహించే సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులకు నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎం. సాగర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు అధ్యక్షత వహించగా, ఎలగంటి రాజేందర్ (ఐఐటీయూ), ఐలయ్య (ఏఎఫ్టీయూ), యాకోబు తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె వాయిదా

● తాటిపాముల వెంకట్రాములు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శ్రమజీవుల హక్కుల పరిరక్షణ కోసం మే 20న నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్ జూలై 9కి వాయిదా పడిందని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఢిల్లీలో గురువారం సమావేశమైన కేంద్ర కార్మిక సంఘాల, స్వతంత్ర సమాఖ్యల ప్రతినిధుల సంయుక్త సమావేశంలో ఈ నిర్ణయం చేశారని, అయితే శ్రమజీవుల డిమాండ్ల సాధనలో భాగంగా మే 20న రాష్ట్ర, జిల్లా, కార్మిక కేంద్రాలలో ప్రదర్శనలు నిర్వహించాలని ఆ సమావేశం పిలుపునిచ్చిందని తెలిపారు. జమ్ము కాశ్మీర్ లోని పహల్గాంలో జరిగిన పాశవిక ఉగ్ర దాడి, 26 మంది అమాయక పర్యాటకుల బలిదానం, అనంతరం ఆపరేషన్ సింధూర్ తదనంతర పరిణామాలు, దేశంలో రాజకీయ పరిస్థితులు వాటన్నింటినీ సమీక్షించిన కేంద్ర కార్మిక సంఘాల నాయకుల సమావేశం ఈనాడున్న సంక్లిష్ట రాజకీయ పరిస్థితులలో సార్వత్రిక సమ్మె గ్రామీణ బంద్ మే 20న జరపడం భావ్యం కాదని భావించి జులై 9కి వాయిదా వేశారని ఆయన తెలిపారు. ఈ మార్పును గమనించి సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్ జులై 9న నిర్వహించడానికి ఇప్పటి నుంచే విస్తృతంగా ప్రచార కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా సమాయత్తం కావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను విడనాలని డిమాండ్ చేస్తూ మే 20న జిల్లా, కార్మిక కేంద్రాల్లో ప్రదర్శనలు నిర్వహించాలని కేంద్ర సంఘాల సంయుక్త సమావేశం ఇచ్చిన పిలుపును విజయవంతం చేయాలని వెంకట్రాములు ఆ ప్రకటనలో కోరారు.



# మారోజ వీరన్న స్ఫూర్తితో బహుజన రాజ్యాన్ని సాధిద్దాం



**➲ ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారతదేశ స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ల తర్వాత కూడా మెజార్టీ ప్రజలు దోపిడీకి గురవుతూనే ఉన్నారని, ఈ పరిస్థితి నుంచి బయటపడాలంటే బహుజన రాజ్యమే మార్గమని ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ అన్నారు. శుక్రవారం హనుమకొండ అంబేద్కర్ సెంటర్‌లో జరిగిన కామ్రేడ్ మారోజు వీరన్న 26వ వర్ధంతి సభలో ఆయన పాల్గొని వీరన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వీరన్న జీవితం నుంచి బహుజనులు రాజకీయ చైతన్యం సాధించాలని పిలుపునిచ్చారు. వీరు కులవర్గ నిర్మూలన కోసం జీవితమంతా పోరాడిన కమ్యూనిస్టు నాయకుడు, ఇండియా సంయుక్త రాష్ట్రాల కమ్యూనిస్టు పార్టీ స్థాపకుడని కొనియాడారు. బ్రాహ్మణీయ భావజాలం వల్ల వేల కులాలుగా విభజించబడిన బహుజన సమాజం దోపిడీకి గురవుతుండటాన్ని ఆయన ఆవేదనతో పేర్కొన్నారు. బహుజనులు శ్రమలో, ఉత్పత్తిలో ప్రధాన భాగస్వాములై ఉన్నా, వారు అధికారానికి దూరంగా ఉన్నారని, ఈ పరిస్థితిని మార్చాలంటే రాజకీయ చైతన్యం అవసరమని అన్నారు. బహుజన సమాజానికి చెందిన వారు ఎదిగితే, మిగిలిన వర్గాలను అభివృద్ధి పరచాలన్న స్పృహ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వం కుల గణనపై తటస్థంగా ఉండకూడదని, రాజకీయ రిజర్వేషన్లతో పాటు అభివృద్ధి ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి, బీసీ మేధావుల ఫోరం జిల్లా అధ్యక్షుడు కొంగ వీరాస్వామి తదితరులు మాట్లాడుతూ బీజేపీ ఉగ్రవాద రాజకీయాలతో దళిత, ఆదివాసులపై దాడులు చేస్తోందని, బహుజనుల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. కమ్యూనిస్టు ఉద్యమాల్లో ఉన్న లోపాలను 27 ఏళ్ల క్రితమే మారోజు వీరన్న గుర్తించారని, ప్రజలతో కలిసి స్వీకారయోగ్యమైన ఉద్యమాలకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. గత 70 ఏళ్లుగా పాలకులు ప్రజల అభివృద్ధికి కాకుండా దోపిడీకి పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. మహాత్మా జ్యోతిరావు పూలే, పెరియార్, బాబాసాహెబ్ అంబేద్కర్, కాన్షీరామ్ కలలుగా భావించిన బహుజన రాజ్యాన్ని స్థాపించేందుకు ప్రగతిశీల శక్తులు, బహుజన వాదులు ఏకం కావాలని పిలుపునిచ్చారు.

హనుమకొండ జాక్ చైర్మన్ తాడిశెట్టి క్రాంతికుమార్, న్యూ డెమోక్రసీ నాయకుడు నున్న అప్పారావు, టీజేఎస్ అధ్యక్షుడు చిల్ల రాజేంద్రప్రసాద్, ఎ.ఐ.ఎఫ్.డి.వై రాష్ట్ర అధ్యక్షుడు కర్ర రాజిరెడ్డి, రజక రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గే, ఎంసీపీఐ నాయకులు చీపురు ఓదయ్య, ఐతం నాగేశ్, న్యాయవాది అనిల్, ఇతర సంఘాల నాయకులు రాసమల్ల లక్ష్మణ్, పెండెల సంపత్, జంగిలి శ్రీనివాస్, బానోత్ సునీల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# 18న శాంతియుత ర్యాలీని విజయవంతం చేయాలి

**➲ మహమ్మద్ అయ్యుం**

**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** నూతన వక్ఫ్ బోర్డు చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మే 18న వరంగల్ పట్టణంలో నిర్వహించే శాంతియుత జల్సా ర్యాలీని విజయం సాధించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ముస్లిం మైనార్టీ మండల అధ్యక్షుడు మహమ్మద్ అయ్యుం పిలుపునిచ్చారు. శుక్రవారం, మండలంలోని పాత ముగ్దుంపురం గ్రామంలోని మజిదే మహమ్మదీయ మసీదులో ముస్లింలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 18న వరంగల్ పట్టణంలో శాంతియుత ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే రోజు సాయంత్రం 6:30 గంటలకు ఇస్లామియా కాలేజ్ గ్రౌండ్‌లో బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ బహిరంగ సభలో ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు సదర్ హజ్రత్ మౌలానా ఖాలీద్ సైఫుల్లా



రెహమానీ సాహెబ్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారని వెల్లడించారు. గ్రామాలలోని ముస్లింలు పెద్ద ఎత్తున హాజరై ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పేష్ ఇమామ్ మహమ్మద్ ఇజాజ్ అన్సారీ, సదర్ సాబ్ పటాన్ యాకూబ్, సయ్యద్ కరీం, మహమ్మద్ యాకూబ్, ఫయాజ్ పాషా, ఖాజా పాషా, అబ్దుల్ రెహాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# అవయవదాత సంస్మరణ సభ




**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని స్వామి తండాకు చెందిన బానోతు రమణ (25) గత నెల 26న జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడి, హైదరాబాద్‌లోని యశోదా ఆసుపత్రికి తరలించబడ్డాడు. మెరుగైన వైద్యం అందుకుంటున్న సమయంలో, మే 2న ఆయన బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించబడ్డాడు. ఈ దుఃఖ సమయంలో, 'జీవన్ దాన్' సంస్థ వైద్యులు, సిబ్బంది బానోతు రమణ తల్లిదండ్రులు దేవేందర్, విజయ దంపతులను సంప్రదించి, అవయవదానం ద్వారా ఇతరులకు జీవం ఇచ్చే మహత్తర అవకాశం గురించి వివరించారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు దాతృత్వాన్ని ప్రదర్శించి, అవయవదానానికి అంగీకరించారు. బానోతు రమణ కాలేయం, రెండు కిడ్నీలు, రెండు నేత్రాలు దానం చేయడం ద్వారా ఆరుగురికి ప్రాణదానం చేసి పునర్జన్మ కలిగించాడు. ఈ నేపథ్యంలో మే 16న తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో వారి నివాసంలో



అవయవదాత సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మృతుడి ఆత్మశాంతి కోసం మౌనప్రార్థన, శ్రద్ధాంజలి నివాళులు అర్పించి, కుటుంబానికి సన్మానం చేశారు. శాలువా కప్పి, అవయవ దాన అభినందన పత్రాన్ని అందజేశారు. బంధుమిత్రులకు అవయవ దానంపై అవగాహన కల్పించారు. ఈ సభలో తండ నాయకులు యాకూబ్ నాయక్, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పెల్లి ఉపేందర్ రెడ్డి, ఉపాధ్యక్షురాలు మునగాల పద్మ, వరంగల్ జిల్లా అధ్యక్షులు కోన్ రెడ్డి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శులు జనార్దన్ రెడ్డి, ఏ. రాజేంద్రప్రసాద్, ఆర్ఎంపీ వైద్యుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# పేద మహిళకు కుట్టు మిషన్ వితరణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రభుత్వ ఉన్నత పాఠశాల మాసూం అలీలో ప్రధాన ఉపాధ్యాయుడు డాక్టర్ బీవీ ఎన్. స్వామి అధ్యక్షతన శుక్రవారం నాడు నిర్వహించిన ఓ సేవా కార్యక్రమంలో, హెల్పింగ్ హార్ట్స్ ఫౌండర్ బొగ్గరపు రామకృష్ణ ఆధ్వర్యంలో అచ్చంపేట వాసి పెద్ది లక్ష్మికాంత్ పుట్టినరోజు సందర్భంగా పేద మహిళ పరవస్తు జ్యోతి కి కుట్టు మిషన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన భార్య పవిత్ర, కుమార్తెలు భవ్యశ్రీ, ఆద్య కూడా పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ బీవీ ఎన్. స్వామి మాట్లాడుతూ, "గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలల్ని ఎంపిక చేసుకుని పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తున్న హెల్పింగ్ హార్ట్స్ వ్యవస్థాపకుడు రామకృష్ణ సేవలు ప్రసంశనీయమన్నారు. తర్వాత రామకృష్ణ మాట్లాడుతూ, "ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించడానికి అవకాశం కల్పించిన పెద్ది లక్ష్మికాంత్, ఆయన సతీమణి పవిత్ర, కుమార్తెలు భవ్యశ్రీ, ఆద్యకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. లక్ష్మికాంత్ మరిన్ని పుట్టిన రోజులు ఆనందంగా జరుపుకునే అవకాశాలు కలగాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కనకయ్య, కమలాకర్, భిక్షపతి, శ్రీధరాచార్యులు, కిషన్, బాష్కర్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, పరకాల :** ఒకటో వార్డు లో క్షతగాత్రులను పరామర్శించిన మాజీ కౌన్సిలర్ మడికొండ. సంపత్ కుమార్ గురువారం సాయంత్రం 6 గంటల సమయంలో హనుమకొండ ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయి ఆటోలో పరకాలకు వస్తున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్త బొచ్చు విష్ణు గారి కుటుంబం రామకృష్ణాపురం వద్ద ప్రమాదవశాత్తు జరిగిన యాక్సిడెంట్లో గాయపడిన క్షతగాత్రులను ఈరోజు ఉదయం వారి ఇంటివద్దకువెళ్లి పరామర్శించిన మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్ గారు, బొచ్చు విష్ణు గారికి రెండు కాళ్లు విరిగగా వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని వారి కుటుంబ సభ్యులు తెలుపగా, బొచ్చు విష్ణు గారికి ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితి గురుంచి తెలుసుకున్నారు.

# అందాల పోటీలపై పెట్టిన శ్రద్ధ ప్రజా సమస్యలపై ఏదీ



**వరంగల్ వాయిస్, పరకాల :** తెలంగాణ ప్రభుత్వం అందాల భామల పోటీలపై చూపిన శ్రద్ధను విద్యార్థుల భవిష్యత్తుపై చూపడం లేదని బీజేపీ పరకాల పట్టణ నాయకుడు దార్నా సునీల్ కుమార్ విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రాష్ట్రంలోని విద్యార్థులు, రైతుల పట్ల ఎలాంటి చిత్తశుద్ధి లేదని ఆయన ఆరోపించారు. ఓవైపు రాష్ట్రానికి ఆదాయం లేదంటూ ప్రభుత్వమే చెబుతుండగా, మరోవైపు అందాల భామల పోటీలు, విందులకు రూ. 35 కోట్లు ఖర్చు చేయడం పూర్తిగా దుబారా చర్యగా పేర్కొన్నారు. మరోవైపు విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 8,000 కోట్ల బకాయిలను చెల్లించకపోవడం విద్యార్థుల భవిష్యత్తుపై నెగటివ్ ప్రభావం చూపుతుందన్నారు. విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించాలంటే వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె వాయిదా

**రామ రాజేష్ ఖన్నా**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 20న నిర్వహించాల్సిన దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె వాయిదా పడిందని జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటియుసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా తెలిపారు. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో అమాయక పర్యాటకులపై ఉగ్రదాడి జరిగిన ఘటనను దృష్టిలో పెట్టుకుని, దేశంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో హైదరాబాద్ ఇందిరా పార్క్‌లో ఈ నెల 20న జరగాల్సిన ధర్నాను వాయిదా వేసినట్లు వెల్లడించారు. అదే విధంగా, దేశవ్యాప్తంగా చేపట్టాల్సిన సార్వత్రిక సమ్మెను 2025 జూలై 9కి మార్చినట్లు ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ నేతలు



**వరంగల్ వాయిస్, జమ్మికుంట :** కరీంనగర్ జిల్లా మడిపల్లి గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి చెన్నవేన రమేష్–అనూషల వివాహ మహోత్సవం జమ్మికుంట పట్టణంలోని స్వాతి గార్డెన్స్‌లో శుక్రవారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్ బాబు, జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న, సదానందం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎగ్గేటి సదానందం, మడిపల్లి గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు ఉప్పుల సాంబశివరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అంబాల రాజు, మ్యాకమల్ల అశోక్, మైనార్టీ సెల్ నాయకుడు మహమ్మద్ సందాని తదితరులు పాల్గొన్నారు.

## అపరిశుభ్ర హోటల్స్ పై పెనాల్టీలు

**రూ.62 వేల జరిమానాలు విధింపు**



**వరంగల్ వాయిస్, బల్దియా :** అపరిశుభ్ర పరిస్థితుల్లో, ట్రేడ్ లైసెన్స్ లేకుండా హోటల్స్ నిర్వహణకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయానికి గాను మొత్తం రూ.62 వేలు జరిమానా విధించినట్లు బల్దియా ముఖ్య ఆరోగ్యాధికారి డా.రాజారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం నగర పరిధి లోని పలు హోటళ్లు, రెస్టారెంట్ లు షాపులను శానిటేషన్ అధికారులు తనిఖీలు చేపట్టి అపరిశుభ్ర పరిస్థితుల్లో హోటల్ నడుపుతున్న 51 వ డివిజన్ పరిధి లోని ఎక్సైజ్ కాలనీలో గల నాటుకోడి చిట్టి గారెలు హోటల్ కు రూ.30 వేలు ట్రేడ్ లైసెన్స్ లేకుండా రెస్టారెంట్ నిర్వహిస్తున్న హంటర్ రోడ్డులోని కడాయి రెస్టారెంట్‌కు రూ.30 వేలు నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయిస్తున్న వెంకట సాయి కిరాణా షాపు యజమానికి రూ.2 వేలు జరిమానా తో కలిపి మొత్తం గా రూ.62 వేల జరిమానా విధించినట్లు సీఎం హెచ్ఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్, సంపత్ రెడ్డి, నిరంజన్, అనిల్ ప్లాస్టిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృంద సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా బీరన్న కామరతి కళ్యాణ మహోత్సవం



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి:** హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండల కేంద్రంలోని గొల్ల కురుమల ఆరాధ్య దైవమైన బీరన్న కామరతి కళ్యాణ మహోత్సవం శుక్రవారం వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఉదయం గొల్ల కురుమ పెద్దమనుషుల ఆధ్వర్యంలో బీరన్న విగ్రహాలకు పాలు, నెయ్యితో అభిషేకం చేశారు. బీరన్న పూజారులు, ఒగ్గు కళాకారులు, డోలు బృందాలు, శివసత్తుల నృత్యాలతో కలిసి గొల్ల కురుమల కుటుంబ సభ్యులు పాలు, నీళ్లు, నెయ్యి భరించిన బిందెలతో బీరన్న గుడికి ఊరేగింపుగా బయలుదేరారు. పూజారులు చేసిన శివశక్తుల విన్యాసాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. బీరన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాలకు పాలు, నెయ్యి, పూలతో అభిషేకం చేశారు. అనంతరం గ్రామంలోని పెద్దమ్మ తల్లి, ఎల్లమ్మ తల్లి, పోచమ్మ తల్లి, వెంకటేశ్వర స్వామి, శివాలయం, మార్కండేయ ఆలయాల్లో కూడా విగ్రహాలకు పసుపు నీళ్లు, పాలు సమర్పించి అభిషేకాలు చేశారు. ఈ నేపథ్యంలో కురుమ పెద్దమనిషి ఐదు ఇండ్లలలో జోగు పట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పెద్దమనుషులు మాట్లాడుతూ, ఈ నెల 23 నుండి ఎనిమిది రోజులపాటు బీరన్న ఉత్సవాలు జరగనున్నాయని, ఉత్సవ కాలంలో ఊరంతా జాతర వాతావరణంలో మునిగిపోతుందని తెలిపారు. ఈ మహోత్సవంలో కోరే కుమారస్వామి, మారం సుధాకర్, దాడి రాజు, దాడి చిరంజీవి, కోరే లక్ష్మణ్, కోరే సంపత్, కాలే తిరుపతి, వేల్పుల తిరుపతి, నలిగెటి సాంబయ్య, వేల్పుల సాయికుమార్, మారం శ్రీను, కాల్వ మల్లయ్య, నంద రవి, కోరే రమేష్, కాలే సందీప్, కాలే రవి తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్స్‌కు ప్రాధాన్యం

**వరంగల్ వాయిస్, జనగామ:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక ఇంటర్నేషనల్ ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోందని తెలంగాణ మోడల్ స్కూల్స్ టీచర్స్ అసోసియేషన్ (టీఎంఎస్టీఏ) జనగామ జిల్లా అధికార ప్రతినిధి గణేష్ కందగట్ల తెలిపారు. అయితే ఇప్పటికే ఉన్న మౌలిక సదుపాయాలను పరిగణనలోకి తీసుకుంటే, కొన్ని ప్రాంతాల్లో ఈ స్కూల్స్‌ను స్థాపించలేని పరిస్థితుల్లో తెలంగాణ మోడల్ స్కూల్స్‌కు ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు విద్యాశాఖ తాజా చర్యల ద్వారా తెలుస్తోంది. ఇటీవల ఖాన్ అకాడమీ, మోడల్ స్కూల్స్ సంయుక్తంగా వేసవి సెలవుల్లో ప్రత్యేకమైన ఆన్లైన్ కోచింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించాయి. అంతేకాకుండా, అన్ని ప్రభుత్వ పాఠశాలల మాదిరిగానే మోడల్ స్కూల్స్‌లో కూడా ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానెల్స్ (ఐఎఫ్పీ) ద్వారా డిజిటల్ బోధన అందిస్తున్నారు. అదనంగా, ప్రముఖ సాఫ్ట్వేర్ కంపెనీల భాగస్వామ్యంతో మోడల్ స్కూల్స్‌లో కృత్రిమ మేధస్సు (AI) ఫౌండేషన్ కోర్సులు కూడా నిర్వహిస్తున్నారు, ఇవి భవిష్యత్తు విద్యా విధానానికి మార్గదర్శకంగా నిలవనున్నాయి. భారత ప్రభుత్వ నూతన విద్యా విధానం ప్రకారం, దేశంలోని అన్ని పాఠశాలలు ఇకపై +2 విధానంలో ఇంటర్మీడియట్ తరగతులు నిర్వహించాలి. ప్రస్తుతం తెలంగాణలో ఈ విధానంలో నడుస్తున్న ఏకైక ప్రభుత్వ పాఠశాలలు మోడల్ స్కూల్స్ మాత్రమే కావడం వల్ల, ప్రభుత్వం వీటిని మరింతగా బలోపేతం చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. త్వరలో మోడల్ స్కూల్స్ ప్రభుత్వ సొసైటీ పరిధిలో నుంచి నేరుగా విద్యాశాఖకు బదిలీ చేసి మరింత విస్తరణకు సిద్ధమవుతున్నాయి. ఇక విద్యార్థుల "రాయడం, చదవడం, మాట్లాడడం" నైపుణ్యాలను అభివృద్ధి చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకుని ఎఫ్.ఎల్.ఎన్. (ఫౌండేషనల్ లిటరసీ & న్యూమరసీ), ఎల్.ఐ.ఎఫ్. (లాంగ్వేజ్ ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రామ్)లతో పాటు, మోడల్ స్కూల్స్‌లో 6వ తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఆంగ్ల భాష శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ స్థాయిలో ఫీజు మినహాయింపు కూడా అమలులో ఉంది. అయితే జనగామ జిల్లాలో కేవలం 8 మోడల్ స్కూల్స్ మాత్రమే ఉండటం వల్ల స్థానికులు, ఇతర ప్రాంతాల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. అడ్మిషన్ టెస్ట్ రాసిన విద్యార్థులతో పాటు, పరీక్ష రాయని విద్యార్థులు కూడా మీకు దగ్గరలోని మోడల్ స్కూల్‌ను సంప్రదించి అడ్మిషన్ కోసం ప్రయత్నించవచ్చని గణేష్ తెలిపారు.



## యుద్ధం ఆపాలి.. ఉగ్రవాదులను తుద ముట్టించాలి

**● సీపీఐ నేత, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి**

**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** భారత్, పాకిస్తాన్ మధ్య జరుగుతున్న యుద్ధం ఇకనైనా ఆపాలి, సామాన్య ప్రజల ప్రాణాలను హరించే పాకిస్తాన్ ఉగ్రవాదులను తుద ముట్టించాలని సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కంచనపల్లిలో గల కురుమ సంఘం భవనంలో సీపీఐ పార్టీ నాయకులు నాల్కపల్లి దావీద్, ఊడుగుల జయమ్మ అధ్యక్షతన ఏర్పాటుచేసిన సీపీఐ మండల నాల్గవ మహాసభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి, సీపీఐ జిల్లా నాయకులు ఆది సాయన్న, పాతూరి సుగుణమ్మ, ఆకుల శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి మాట్లాడుతూ భారతదేశంలోని పర్యాటక ప్రాంతమైన జమ్మూ కాశ్మీర్ లోని పహాల్గంలో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడిని ఆయన ఖండించారు. దేశంలో సామాన్య ప్రజలపై మరణ హోమం సృష్టిస్తున్న ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని అందుకు సీపీఐ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆయన తెలియజేశారు. భారత ప్రభుత్వం యుద్ధం ఆపి సామాన్య ప్రజల ప్రాణాలను రక్షించాలని అయన కోరారు. భారతదేశ లౌకిక వాదానికి, మత సామరస్యానికి ప్రతీకలైతే మోడీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని మార్చి, మతాల మధ్య చిచ్చు పెడతూ, కలిసి ఉన్న ప్రజల మధ్య అనైక్యతను సృష్టించే లక్ష్యంతో కేంద్రం అనుసరిస్తున్న విధానాలు దేశానికి మంచిది కాదన్నారు. భారతదేశంలో త్యాగాల పునాదులపై



ఎదిగి 100 సంవత్సరాల గణ చరిత్ర కలిగిన సీపీఐ శ్రమజీవులకు అండగా నిలుస్తూ నేడు మహావృక్షమై దేశంలో 29 రాష్ట్రాలకు విస్తరించిందడం పట్ల అయన హర్షం వ్యక్తం చేశారు. సీపీఐ భారత రాజ్యాంగ రక్షణ, మతసామరస్యం, స్వచ్ఛమైన నైతిక విలువలతో కూడిన రాజకీయాలకు కట్టుబడి ఉందన్నారు. కార్పొరేట్ శక్తుల చేతిలో దోపిడీకి గురవుతున్న కార్మికుల పక్షాన సీపీఐ పార్టీ అండగా ఉండి పోరాడుతుందని అయన తెలియజేశారు. అనంతరం బూమల్ల సుధాకర్ ఆధ్వర్యంలో 20 కుటుంబాలు సీపీఐలో చేరగా వారికీ జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజారెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. తదనంతరం వీరంతా కలిసి గ్రామంలో ఏర్పాటు చేసిన సీపీఐ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కావటి యాదగిరి, పార్టీ నాయకులు మడికంటి సోమయ్య, ముప్పిడి ఎల్లయ్య, పసుల దానియల్, కందుకూరి మల్లేష్, బిర్రు నాగేష్, జెనిగల అంజయ్య, జూకంటి రామచంద్రయ్య, అబ్బయ్య, రవి, శ్రీను పాల్గొన్నారు.






# జూన్ 12న విడుదల

పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న భారీ చిత్రం హరి హర వీరమల్లు. ఈ సినిమా విడుదల ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అభిమానులకు ఎట్టకేలకు శుభవార్త అందింది. అన్ని అడ్డంకులను దాటుకొని జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతుంది. ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాకు సంబంధించిన మొత్తం షూటింగ్ ఇప్పటికే పూర్తయింది. ఈ చిత్రం పాన్‌ఇండియా స్థాయిలో విడుదల అవుతుంది. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో పెద్దెత్తున విడుదల కానుంది. అమెజాన్ ప్రైమ్ దీని డిజిటల్ రైట్స్‌ను భారీ ధరకు కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. ఇక ఈ హరి హర వీరమల్లు సినిమా గత కొన్నేళ్లుగా ఆలస్యమవుతూ వచ్చింది. హీరో పవన్ కళ్యాణ్ రాజకీయాల కారణంగా ఈ సినిమా షూటింగ్ నిరవధికంగా ఆగిపోవడంతో ఆలశ్యం అయ్యింది. కానీ ఎట్టకేలకు పవన్ కళ్యాణ్ సినిమా షూటింగ్ లో పాల్గొని పూర్తి చేశారు. మే 6, 2025న సినిమా చిత్రీకరణ ముగిసినట్లు– నిర్మాతలు ప్రకటించారు. గతంలో ఈ సినిమా మార్చి 28, మే 9 తేదీలలో విడుదల అవుతుందని పలు వార్తలు వచ్చినా.. పలు కారణాల వల్ల వాయిదా పడిరది.

# అమెజాన్ ప్రైమ్‌లో..

## అర్జున్ సన్నాఫ్ వైజయంతి

నటులు కల్యాణ్ రామ్, విజయశాంతి కలిసి నటించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి చిత్రం తాజాగా ఓటీటీలోకి వచ్చేసింది. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహించిన ఈ సినిమా ఏప్రిల్ 18న థియేటర్లలో విడుదలైంది. తల్లి కొడుకుల అనుబంధం, యాక్షన్ ప్రధానంగా సాగిన ఈ సినిమాకు థియేటర్లలో మిశ్రమ స్పందన లభించింది. అయితే ఈ సినిమా ఇటీవల రెంటల్ విధానంలో ప్రముఖ ఓటీటీ– వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలోకి వచ్చిన విషయం తెలిసిందే. రెంటల్ రావడంతో సినిమా చూద్దం అనుకున్న ప్రేక్షకులకు నిరాశ ఎదురైంది. అయితే తాజాగా ఈ సినిమాను రెంటల్ నుంచి తొలగించి ఫ్రీగా అందుబాటులోకి తీసుకోచ్చారు. ప్రైమ్ చందదారులు ఈ సినిమాను ఉచితంగా చూడవచ్చు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. వైజయంతి అనే నిజాయితీగల ఐపీఎస్ అధికారి చుట్టూ తిరుగుతుంది. ఆమెకు అర్జున్ అనే ఒకే ఒక్క కొడుకు ఉంటాడు. అర్జున్‌ను ఎలాగైనా ఐపీఎస్ అధికారిగా చూడాలనేది వైజయంతి కల. దాని కోసం ఆమె అతన్ని ఐపీఎస్ చదివించి శిక్షణ కోసం ఢల్లీకి పంపుతుంది. నావికాదళ అధికారి అయిన అతని తండ్రి సముద్రంలో జరిగిన ప్రమాదంలో మరణించాడని పోలీసులు చెబుతారు. అయితే నిజానికి అర్జున్ తండ్రి మరణానికి కారణం ప్రమాదం కాదు, అది ఒక హత్య. ఆ విషయం తెలుసుకున్న అర్జున్, తన తండ్రిని చంపిన వారిపై పగ తీర్చుకోవాలనుకుంటాడు. కానీ వైజయంతి అతన్ని వారించి, చట్ట ప్రకారం దోషులకు శిక్ష పడేలా చూస్తానని చెబుతుంది. అర్జున్ తండ్రిది హత్య కాదని, అది ప్రమాదవశాత్తు జరిగిందని కోర్టు తీర్పు ఇస్తుంది. హంతకులు కోర్టు నుండి బయటకు వస్తూనే వైజయంతిని అవమానకరంగా మాట్లాడుతారు. తన కళ్ల ముందే తల్లిని అవమానిస్తుంటే అతను తట్టు–కోలేకపోతాడు. అతని కోపం కట్టలు తెంచుకుంటుంది. కోర్టు ఎదురుగానే ఒక హంతకుడిని కొట్టి చంపేస్తాడు. ఐపీఎస్ కావాల్సిన కొడుకు తన కళ్ల ముందే హంతకుడిగా మారడం చూసిన వైజయంతి దిగ్భ్రాంతికి గురవుతుంది. గూండాగా మారిన కొడుకుతోనే యుద్ధానికి సిద్ధమవుతుంది. మరి విధి వేరు చేసిన ఈ తల్లి కొడుకులు మళ్లీ ఎలా కలిశారు? ఐపీఎస్ అవ్వాల్సిన అర్జున్ గూండాగా మారి ఏమి సాధించాడన్నది మిగతా కథ.

# రామాయణంలో మండోదరిగా కాజల్ ?

టాలీవుడ్, బాలీవుడ్‌లో తనదైన ముద్ర వేసిన ప్రముఖ నటి కాజల్ అగర్వాల్ పెళ్లి తర్వాత సినిమాలకు గ్యాప్ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే చాలా రోజుల తర్వాత సత్యభామ అంటూ ఇటీ–వల ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి హిట్ అందుకుంది. అయితే ఈ భామ తాజాగా మరో బంఫరాఫర్ కొట్టినట్లు– తెలుస్తుంది. బాలీవుడ్ దర్శకుడు నితీష్ తివారి తెరకెక్కిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం రామాయణలో కాజల్ ఛాన్స్ కొట్టేసినట్లు– తెలుస్తుంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఈ సినిమాలో కాజల్ రావణుడి భార్య మండోదరి పాత్రలో కనిపించనున్నారు. నితీష్ తివారి 'రామాయణ' ప్రాజెక్ట్ అనౌన్స్ చేసినప్పటి నుంచి నటీనటుల ఎంపికపై అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే రాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి ఖరారయ్యారు. ఇప్పుడు మండోదరి పాత్ర కోసం కాజల్ అగర్వాల్‌ను ఎంపిక చేసినట్లు– వార్తలు వస్తున్నాయి. కాజల్ అగర్వాల్ తన కెరీర్‌లో వైవిధ్యమైన పాత్రలు పోషించారు. ఆమె నటనకు మంచి గుర్తింపు ఉంది. 'మగధీర', 'డార్లింగ్', 'బృందావనం' వంటి తెలుగు చిత్రాలతో పాటు–, 'సింగం', 'స్పెషల్ 26' వంటి హిందీ చిత్రాల్లోనూ ఆమె తన ప్రతిభను చాటు–కున్నారు. ఇప్పుడు 'రామాయణం' వంటి ప్రతిష్టాత్మక చిత్రంలో మండోదరి వంటి బలమైన పాత్రలో ఆమె ఎలా మెప్పిస్తారో చూడాలి. మండోదరి పాత్ర రామాయణంలో ఒక ముఖ్యమైన పాత్ర. రావణుడి పట్టపురాణిగా ఆమె రావణుడికి మంచి సలహాలు ఇస్తూ, ధర్మం వైపు నిలబడే ప్రయత్నం చేస్తుంది. తన భర్త తప్పులను ఎత్తిచూపుతూ, సీతను తిరిగి రాముడికి అప్పగించాలని సూచిస్తుంది. కాబట్టి, ఈ పాత్రకు కాజల్ వంటి అనుభవం ఉన్న నటి అయితే మరింత న్యాయం చేకూరుస్తుందని మేకర్స్ భావిస్తున్నట్లు– సమాచారం. అయితే, ఈ విషయంపై చిత్రబృందం నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఒకవేళ ఈ వార్త నిజమైతే, కాజల్ అగర్వాల్ కెరీర్‌లో ఇది ఒక మైలురాయిగా నిలిచిపోతుంది అనడంలో సందేహం లేదు. నితీష్ తివారి 'రామాయణం' మూడు భాగాలుగా తెరకెక్కనున్నట్లు సమాచారం. ఈ చిత్రం భారతీయ సినిమా చరిత్రలో ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకుంటు–ందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. భారీ తారాగణం, అత్యున్నత సాంకేతికతతో ఈ చిత్రం రూపొందనుంది.






# ఎన్టీఆర్ నెగెటివ్ షేడ్‌లో వార్-2

## 20న టీఈజర్ విడుదలకు సన్నాహాలు

బాలీవుడ్‌లో ఇదివరకు సంచలన విజయం అందుకున్న యాక్షన్ స్పై థ్రిల్లర్ 'వార్'కు సీక్వెల్‌గా రాబోతున్న చిత్రం 'వార్ 2'. 2019లో విడుదలైన మొదటి భాగంలో హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ యాక్షన్ సీన్స్‌తో ప్రేక్షకులను మెస్మరైజ్ చేశారు. ఇప్పుడు ఈ సీక్వెల్‌కి మరింత క్రేజీగా రూపొందించడానికి పాన్ ఇండియా స్టార్ ఎన్టీఆర్ రంగంలోకి దిగాడు. ఇది ఎన్టీఆర్‌కి బాలీవుడ్‌లో తొలి చిత్రం కావడంతోనే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రాన్ని 'బ్రహ్మాస్త్ర' వంటి విజువల్ వండర్‌ని తెరపైకి తీసుకొచ్చిన అయాన్ ముఖర్జీ డైరెక్ట్ చేస్తున్నారు. యశ్ రాజ్ ఫిలిమ్స్ నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ చిత్రానికి సరికొత్త మేకింగ్ కథాంశం ఉండబోతున్నట్లు సమాచారం. ఈ సినిమాలో ఎన్టీఆర్ పాత్ర ఎలా ఉండబోతుందనేది అభిమానుల్లో పెద్ద క్యూరియాసిటీగా మారింది. కొన్ని లీకుల ప్రకారం, ఆయన నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించనున్నారని, అయితే అది పూర్తిగా విలన్ కాదని.. గ్రే షేడ్స్ కలిగిన పవర్‌ఫుల్ క్యారెక్టర్ అని సమాచారం. కొత్త లుక్‌లో ఎన్టీఆర్ స్కీన్‌పై ఎలా కనిపిస్తాడన్నదే ఇప్పుడు ప్రధాన చర్చాంశం. ఇక ఈ సినిమాకు సంబంధించి టీజర్ విషయానికి వస్తే.. ఎన్టీఆర్ పుట్టినరోజు మే 20 సందర్భంగా చిత్ర యూనిట్ రిలీజ్ చేయాలనే ప్లాన్‌లో ఉంది.



# భక్తులకు ఇబ్బందులు కలగనివొద్దు

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ
- రెండో రోజు సరస్వతి పుష్కరాల ఏర్పాట్ల పరిశీలన



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** సరస్వతీ పుష్కరాలకు తరలి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ కాలినడకన తిరుగుతూ అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లు, టెంట్ సిటీ, సరస్వతి ఘాట్ వద్ద పుష్కర ఏర్పాట్లు, సౌకర్యాలు, మరుగుదొడ్లు, షవర్స్, ఘాట్స్, చలి వేంద్రం పరిశీలించారు. ఈ సందర్భంగా జైళ్ల శాఖ ఆధ్వర్యంలో ఖైదీలు తయారు చేసిన హ్యాండ్ మేడ్ వస్తువుల స్టాల్ ను ప్రారంభించారు. వివిధ స్టాళ్లు పరిశీలించి వ్యాపారాలు గురించి అడిగి తెలుసుకున్నారు. చలి వేంద్రాలలో మంచినీటి సరఫరాను పరిశీలించారు. త్రివేణి సంగమం వద్ద భక్తులకు మంచినీటి సరఫరాకు చలి వేంద్రం ఏర్పాటు చేయాలని తక్షణమే వాకిటాకీ ద్వారా ఆర్ డబ్ల్యూఎస్ ఈఈని ఆదేశించారు. భక్తులతో తాగు నీరు అందుతుందా? మరుగుదొడ్లు, షవర్స్ ఎలా ఉన్నాయంటూ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భక్తుల అభిప్రాయాలను తెలుసుకొని అధికారులకు తగిన సూచనలు చేశారు. త్రివేణి సంగమంలో భక్తులు స్నానాలకు వెళ్లే మార్గంలో పిండ ప్రదానం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని దాని వల్ల భక్తులు ఇబ్బందులు పడుతున్నారని వచ్చిన ఫిర్యాదుల మేరకు కలెక్టర్ స్పందించారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మార్గంలో ఎలాంటి పిండ ప్రదానం కార్యక్రమాలు నిర్వహించరాదంటూ సూచించారు. పిండ ప్రదానం కార్యక్రమాలు నిర్వాహణకు కేటాయించిన ప్రత్యేక ప్రాంతంలో మాత్రమే నిర్వహించాలన్నారు. వ్యర్థాలు గ్రామ పంచాయతి ఏర్పాటు చేసిన డస్ట్ బిన్స్ లో వేయాలని, త్రివేణి సంగమంలో వేయవద్దన్నారు. భక్తులు నది పవిత్రను కాపాడాలని సూచించారు. అనతరం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సరస్వతి ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన సెల్ఫీ స్టాల్ లో భక్తులతో ఫొటో దిగారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, పరిశ్రమల శాఖ జీఎం సిద్ధార్థ, డీఆర్డీఓ నరేష్, డీటీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జైళ్ల శాఖ ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు

- ప్రారంభించిన డైరక్టర్ జనరల్ సౌమ్య మిశ్రా
- ఆదరించాలంటూ విజ్ఞప్తి



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** సర్వసతి పుష్కరాల సందర్భంగా కాళేశ్వర్యంలో జైళ్ల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ లను సద్వినియోగం చేసుకోవాలని జైళ్ల శాఖ డైరక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా కోరారు. మే 15వ తేదీ నుంచి 26 వరకు 12 రోజుల పాటు పుష్కరాలను నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం వివిధ హస్తకళల, చేనేత వారిని ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రత్యే స్టాల్స్ ఏర్పాటు చేశారు. వీటిని జైళ్ల శాఖ డైరక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ తెలంగాణ జైళ్ల శాఖ ద్వారా ఖైదీలచే ఉత్పత్తి చేసిన వివిధ వస్తువులను కొనుగొలుకై, ఖైదీల పని తీరును ప్రోత్సహించుటకు ఈ స్టాల్స్ ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. జైళ్ల శాఖలో ఖైదీలకు వివిధ ఉత్పత్తి రంగాలలో శిక్షణ కల్పిస్తూ నాణ్యమైన వస్తువులను వారిచే తయారు చేయించి ఖైదీలకు ఉపాధి కల్పించడంతోపాటు వారిలో సత్ప్రవర్తన కలిగేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఖైదీలకు ఉపాధి కల్పన తీసికొస్తూ వారికి వారి కుటుంబాలకు ఆర్థికభరోసాగా నిలుస్తున్నామని వెల్లడించారు. ప్రజలందరూ ఇట్టి స్టాల్స్ లను ఆదారించి నాణ్యమైన, సరసమైన ధరలకు కొనుగొలు చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వరంగల్ రేంజ్ డీఐజీ ఎం. సంపత్, భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహేల్ శర్మ, కేంద్ర కారాగారము, వరంగల్ పర్యవేక్షణాధికారి టి.కళాసాగర్, ఉవ పర్యవేక్షణాధికారులు పి.వెంకటేశ్వర స్వామి, జైలర్ పి.పూర్ణ చందర్, సబ్ జైలు, వరకాల పర్యవేక్షణాధికారి శ్రీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



## 87 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాం

- యాసంగి ధాన్యం సేకరణపై మంత్రుల వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రబీ సీజన్ కు గాను జిల్లాలో 182 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రెండు లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం సేకరణ అంచనా వేయగా ఇప్పటివరకు 87 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. హైదరాబాదు నుంచి శుక్రవారం యాసంగి ధాన్యం సేకరణపై రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్.చౌహాన్ లతో కలిసి శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ నుంచి వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల గురించి మంత్రులకు వివరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో అన్ని ఏర్పాట్లు చేశామని, నిత్యం పర్యవేక్షణ చేయడం జరుగుతున్నదన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఈ సారి రాష్ట్రంలో యాసంగి సీజన్ లో రికార్డు స్థాయిలో వరి ధాన్యం సాగు అయిందన్నారు. ఈ నేపథ్యంలో ధాన్యం సేకరణను ఓ మహా యజ్ఞంలా భావిస్తూ, రైతుల నుంచి ప్రభుత్వం పెద్ద ఎత్తున మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తోందని తెలిపారు. సన్నలకు బోనస్ సైతం చెల్లించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో 60.14 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేయగా, 129.35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వచ్చాయని వివరించారు. ధాన్యం నిల్వ చేసుకునేందుకు వీలుగా ఇంటర్మీడియట్ గిడ్డంగులను గుర్తించాలని సూచించారు. అకాల వర్షాల వల్ల ధాన్యం నిల్వలు తడిసిపోకుండా వాతావరణ పరిస్థితుల గురించి క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది ముందస్తుగానే రైతులకు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు తెలియజేస్తూ వారిని అప్రమత్తం చేయాలన్నారు. మరో రెండు వారాల పాటు ధాన్యం సేకరణ ప్రక్రియ కొనసాగనున్న దృష్ట్యా, ఎలాంటి ఇబ్బందులకు ఆస్కారం లేకుండా సాఫీగా కొనుగోళ్లు పూర్తయ్యేలా అధికారులు అంకిత భావంతో కృషి చేయాలని హితవు పలికారు. కాగా, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సన్న బియ్యం పంపిణీలో ఎలాంటి అవాంతరాలు లేకుండా పర్యవేక్షణ జరపాలని, నాణ్యమైన బియ్యం పంపిణీ జరిగేలా చూడాలన్నారు. కొత్త రేషన్ కార్డులు, కుటుంబ సభ్యుల పేర్ల నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను వెంటవెంటనే పరిశీలిస్తూ మంజూరీలు తెలుపాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బోగస్ కార్డులు జారీ కాకుండా పకడ్బందీ పరిశీలన జరపాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో వరంగల్ జిల్లా నుంచి డీసీఓ నీరజ , డీఏఓ అనురాధ, డీఆర్డీఓ కౌసల్య దేవి, డీఎం సివిల్ సప్లై సంధ్యారాణి, డీఎస్ఓ కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

## 21 నుంచి సైలాని బాబా ఉర్సు ఉత్సవాలు

- రెండు రోజుల పాటు ఒగ్లాపూర్ దర్గాలో వేడుకలు




**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని ఒగ్లాపూర్ గ్రామంలో ఉన్న సైలాని బాబా దర్గాలో ఈ నెల 21, 22 తేదీల్లో ఉర్సు ఉత్సవాలు జరగనున్నట్లు దర్గా పీఠాధిపతి మహమ్మద్ అబ్దుల్ హమీద్ షామియా తెలిపారు. 21న సందల్ ఊరేగింపు నిర్వహించనున్నారు. జాతర నేపథ్యంలో పరకాల ఆర్డీఓ నారాయణ శుక్రవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంధం ఉత్సవాలను దృష్టిలో ఉంచుకొని అన్ని ఏర్పాట్లు విస్తృతంగా చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ఉత్సవాలకు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, ఎర్రబెల్లి ప్రదీప్ రావు, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తదితర ప్రముఖులు హాజరవుతారని దర్గా పీఠాధిపతి తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మార్వో జ్యోతి వరలక్ష్మి దేవి, ఎంపీడీవో గుమ్మడి కల్పన, ఆత్మకూరు సీఐ సంతోష్, ఎస్సై కొంక అశోక్, మొయినుద్దీన్, పోతుల కొమ్మాలు, గ్రామపంచాయతీ కార్యదర్శి ఇంజపెల్లి నరేష్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్లను సందర్శించిన సీపీ



**వరంగల్ వాయిస్, క్రైం :** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ శుక్రవారం వెస్ట్‌జోన్ పరిధిలోని చిల్పూర్, తరిగొప్పుల, నర్మెట్ట, జనగామ పోలీస్ స్టేషన్లతో పాటు వెస్ట్ జోన్ డీసీపీ కార్యాలయాన్ని సందర్శించారు. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా వెస్ట్‌జోన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లను సందర్శించిన పోలీస్ కమిషనర్ ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. స్టేషన్ పరిధిలో ఎన్నిసెక్టార్లు ఉన్నాయి, సెక్టార్‌వారిగా ఎస్.ఐలు నిర్వహిస్తున్న విధులు, వారి పరిధిలోని రౌడీ షీటర్లు, అనుమానితులు వారి ప్రస్తుత స్థితి గతులను సంబంధిత సెక్టార్ ఎస్.ఐని అడిగి తెలిసుకోవడంతో పాటు స్టేషన్‌వారిగా బ్లూకోల్ట్స్ సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com